# గురుశిష్య పరంపర

అరిగే రామారావు

"శోభనాద్రి నాయుడుగారు వున్నారా బాబూ?"

**గేటు తీసుకొని బయటికి రాబోతున్న ఆ యింటి వారబ్బాయి ఎదురుగా నిలబడ్డ ఆ ఆగంతుకురాలి వంకా, ఆమె ప్రక్కనే నిలబడ్డ యువకుని వంకా ఆశ్చర్యంగా చూశాడు.**

ఎప్పుడో ముప్పైఏళ్ళ క్రితమే చనిపోయిన తమ తాతగార్ని అడుగుతూ వచ్చిన ఆ వృద్ధురాలి వంక వింతగా చూశాడు.

ఆమెకు డెబ్బయేళ్ళ వయస్సుంటుంది. జుట్టు తెల్లగా పండిపోయి ముగ్గు బుట్టలాగా వుంది. కాశీ కట్టు చీరా, మెళ్లో తులసీ మాలలూ, త్రిమూర్తపు నిలువు బొట్టు, చేతులకు కిలుం పట్టిన వంకీ ఇత్తడి గాజులు. ఆమె ప్రక్కనున్నది ఆమె మనమడు కాబోలు. అతనికి ఇరవై రెండేళ్ల వయస్సుండొచ్చు. ఆ వయస్సుకే పంచె కట్టుకొని, తెల్లలాల్చీ వేసుకున్నాడు. చేతిలో పాతట్రంకు పెట్టె పట్టుకొని వున్నాడు.

వీళ్లు చూస్తేనికి బ్రాహ్మణుల్లాగా వున్నారు. ఎప్పుడో తన తండ్రి చిన్నతనంలోనే చనిపోయిన తన తాతగారికీ, వీళ్ళకూ ఏం సంబంధం?

ఆమె, "శోభనాద్రిగారి యిల్లు ఇదేనా నాయనా? ఆయనగారు యింట్లో వున్నారా?" అనుమానంగా మళ్లీ అడిగింది.

"శోభనాద్రిగారిల్లే! కాని, ఆయనెప్పుడో చని పోయారు!" అన్నాడు.

మనిషి ముందు పలికే నీరసంగా వుంది. ఉదయ మెప్పుడో ఇంత గతికి, ఎండనబడి దూరప్రయాణం చేసి వస్తున్న దానిలాగా ఆమె చాలా బడలికగా, నీరసంగా



వుంది చేతిలోని కాషాయరంగు పంచి బరువు మోయ లేక మాటి మాటికి చేతిలోకీ చంకలోకీ మార్చు కుంటగాంది.

ఈ మాట వినగానే ముసలామె పూర్తిగా డీలా పడిపోయింది.

"నాయుడుగారు పోయారా?" తనలో తాను గొణుక్కుంటున్నట్లు అంది. "మరి ఆయనగారి భార్య... ఆమె పేరు ఏదో వుంది! ఆ -సీతమ్మగారు. ఆమె బాగున్నారా నాయనా?" అనుమానంగా అడిగింది.

ఇంకా బ్రతికే వుందన్నట్లు తల వూగించాడు.

ముసలావిడకు ఇందాకటి నీరసం స్థానే వుషారు వచ్చింది. "ఆ సీతమ్మగారు బ్రతికే వున్నారా? ఆమెను కాస్త పిలువు తండ్రీ!" సంభ్రమంగా అంది.

కాటికి కాళ్లు చాపుకొని వున్న తమ నాయనమ్మతో ఈమెకు పనేమిటా అని ఆశ్చర్యపోతూ, "లోపలికి రాండి, పిలుస్తాను!" అంటూ గేటు తెరచి మళ్లీ యింట్లోకి వెళ్ళాడు.

ఆమె సంతోషంగా, "ఒరేయ్ శ్రీరంగశాయీ, రారా! సీతమ్మగారు బ్రతికే వున్నార్రా! అంతా ఆ రామానుజులవారి దయ!" అంటూ లోపలికి దారి తీసింది.

ఇంటి వారబ్బాయి వెనకాలే గుమ్మంలోకి వచ్చిన సీతమ్మగారు- వంగిపోయిన నడుంను పైకి లేపి, కళ్లకు కుడి చెయ్యి అడ్డంగా పెట్టుకొని ముందుకు పారజూస్తూ, "ఎవరమ్మా వచ్చిందీ?" అంది.

ఆ ముసలామె, "నన్ను గుర్తుపట్టలేదా సీతమ్మ

# జన్మదినోత్సవం

అవమానాల అగ్నిపుటంలో
తప్తమైన బంగారం
భరతమాత గళసీమన
వెలుగొందే సింగారం
శిలాయుగపు ఛాందసాల
సంకెళ్ళను ఛేదించే
నవ జీవన
జన జీవన
సహ జీవన
జయ పతాక !
సమసమాజ సౌధంలో
మానవతా మనుగడకై



సమైక్యతా సాధనకై
నవ భారత సంవిధాన
వెలసిందీ, మెరిసిందీ
సువిజ్ఞాన దీపకళిక
విజ్ఞానం వూపిరిగ
సంఘటనం శక్తిగ
ధర్మయుద్ధం సాగిద్దాం
''త్రి శరణా''ల కాంతుల్లో
విశ్వ శాంతిని సాధిద్దాం
ఆనాడే
జనావళికి పర్వదినం
అంబేద్కరు జన్మదినం

— దేవపాలన

గారూ? నేనూ- వర్ధనమ్మనూ! వీడు నా మనమడు శ్రీరంగశాయి. నా కొడుకు తిరుకృష్ణమాచార్యుని పెద్ద కొడుకు. రారా నాయనా, కూర్చో!'' అంటూ పంచె అరుగు మీద కూలబడింది.

''అబ్బబ్బ ఏ ఎండ ఏ ఎండ!'' అంటూ పమిట చెరుగుతో చేతులూ మొగం తుడుచుకొని, ''కాస్త మంచితీర్థం తెప్పించు నాయనా! ఈ అబ్బాయి మీ మనమడా సీతమ్మగారు? చాల బుద్ధిమంతుడు'' అంది.

''మీరెవ్వరో నాకు గుర్తుకు రావటం లేదమ్మా!'' గుమ్మానికి జారగిలబడి కూర్చుంటూ అంది సీతమ్మ గారు.

''అయ్యో తల్లీ, మేం గుర్తులేదా? మేం. మీ గురువులం సీతమ్మగారూ! వీడి తాతగారు శ్రీ మాన్ తిరువేంగళాచార్యులుగారు-మా వారే! కాలం చేశారు. మీ తుమ్మలవారి వంశానికి గురువులం. శ్రీ వైష్ణవ గురుపరంపరలోని వారం!'' వర్ధనమ్మగారి మాటల్లో కించిత్ గర్వం!

''ఏమోనమ్మా! సరిగ్గా గుర్తుకు రావటం లేదు. ఆ రోజుల్లో వయిష్ణవ గురువులు వస్తుండేవాళ్లు!'' అంది సీతమ్మగారు.

''గుర్తుకు రాకపోవచ్చు! ఇప్పటి మాటా ఇదీ! ఎప్పుడో నలభై ఏళ్ళ క్రితం ఆ మారాజు బ్రతికున్న రోజుల్లో ఒకసారి ఇలాగే దేశాటనానికి బయలుదేరి మా శిష్యపరంపరలున్న ఆయా గ్రామాలన్నీ సంచారం చేస్తూ మీ గ్రామంలో దిగేం. మీ యింట్లో పది రోజులు బస చేశాం. పెరుమాళ్లను ప్రతిష్ఠ చేశాం. అప్పట్లో మీకింకా కడుపు పండలేదు. మా వారు శ్రీమాన్ తిరువేంగళాచార్యులు గారు మీకు సంతానప్రాప్తికి మంత్రోపదేశం చేశారు. మీ భర్తగారు శ్రీ శోభనాద్రి నాయుడుగారు ప్రోత్సహించగా మీరు శ్రీ వైష్ణవ మతం స్వీకరించి గురోపదేశం పొంది చక్రాంకితాలు వేయించు కున్నారు. మర్చిపోయారా?'' వర్ధనమ్మగారు ఏకథాటిన అన్నారు.

పాత జ్ఞాపకాలు జ్ఞప్తికి తెచ్చుకుంటూ, ''అవునవును యిప్పుడు గుర్తుకు వస్తోంది...'' అన్నారు సీతమ్మగారు.

సీతమ్మగారి సంతాన వివరాలన్నీ అడిగి తెలుసు కుంది. ఇంతలో ఇంట్లోని మిగతా ఆడవాళ్లూ, పిల్లలూ అంతా వచ్చి వీళ్ల వంక కుతూహలంగా చూస్తూ నిలబడ్డారు.

మంచి తీర్థంగా యిచ్చిన మజ్జిగ త్రాగి వర్ధనమ్మ గారు మళ్ళీ ఇలా చెప్పసాగారు:

''ఈ వూళ్లోనూ, ఈ పరిసర గ్రామాలల్లోనూ మా శిష్యపరంపరలు చాలా మంది వున్నారు. పసుపు లేటివాళ్లూ, ఆకులవాళ్లూ, అరిగెవాళ్లూ, వీరిశెట్టి వాళ్లూ, అల్లంశెట్టి వాళ్లూ... ఇదిగో మా శిష్య పరం పరల జాబితా ఈ తాటాకుల గ్రంథంలో వుంది!'' అంటూ కాషాయ రంగు సంచిలోంచి మాసిపోయిన ఎర్రటి పట్టు గుడ్డలో కట్టిన ఒక తాళపత్రాల చిత్తాను బయటికి తీసింది.

దాన్ని భక్తి ప్రపత్తులతో కళ్ల కద్దుకుంటూ మళ్ళీ ఇలా అంది: ''ఈ గ్రంథం మా పూర్వీకుల నుంచీ మాకు తరతరాలుగా సంక్రమిస్తోన్న ఆస్తి. ఇందులో మా శిష్య పరంపరల వంశ వృక్షాల వివరాలన్నీ వ్రాసి వున్నాయి. శ్రీమాన్ శ్రీరామానుజుల మత పీఠాధి పతులు మాకీ గ్రామాల్లో వున్న ఈ శిష్య పరంపరలను ధారాదత్తం చేశారు. మా శిష్య పరంపరల మంచి చెడ్డలు చూస్తూ వాళ్ళకు ధర్మోపదేశం చేస్తూ, వాళ్ళిచ్చే కట్నాలూ కానుకలూ స్వీకరిస్తూ, మీ శూద్ర కులాల్లో కూడా శ్రీ వైష్ణవాన్ని ప్రచారం చేయమని ఆదేశించారు. వీడి తాతగారూ, వారి తాతదండ్రులూ ఎప్పుడు ఈ గ్రామానికి వచ్చినా ముందుగా మీ యింట్లోనే బస చేసే వాళ్ళు. పెరుమాళ్లను ప్రతిష్ఠ చేయించుకునే హక్కు ఈ గ్రామంలో మీ ఒక్క కుటుం బానికే వుంది. అలా అని ఈ గ్రంథంలో వ్రాసి వుంది.''

''కావచ్చు, ముసలి ముండను నాకివన్నీ ఏం తెలు స్తాయి?'' అంది సీతమ్మగారు.

''పోయినసారి మేం వచ్చినప్పుడు మీ భర్తగారు శోభనాద్రి నాయుడుగారు మాకు గురుభక్తితో సకల మర్యాదలూ చేశారు. మేం వెళ్లేటప్పుడు మాకు నూతన వస్త్రాలు పెట్టి ఎన్నో సంభావనలూ, సంభారాలూ యిచ్చి సాగనంపారు!''

సీతమ్మగారు కన్నీళ్లు పెట్టుకున్నారు. ''అవునమ్మా అవును! ఆ మారాజు చేతికి ఎముక లేకుండా దాన ధర్మాలు చేసేవారు. ఆ రోజులన్నీ ఆయనగార్తోనే పోయాయి!'' అంది.

''అలా అన కండి సీతమ్మగారూ! ఆయనగారు పోతే మీరు లేరూ? ఆయనగారి కుమారులూ, కోడళ్లూ, మనమలూ లేరూ? ఈ గురుశిష్య పరంపర ఇలా సాగిపోవల్సిందేనమ్మా! ఇది ఆ రామానుజులవారి ఆదేశం తల్లీ! ఇదిగో వీడి తండ్రి మంచానబడి వుంటె వీడ్ని తీసికొని నేనే బయలుదేరాను. ముందస్తుగా మీ యింటికే వచ్చాం; ఆనవాయితీ ప్రకారం మీ యింట్లో నా మనమడి చేత పెరుమాళ్లవార్ని ప్రతిష్ఠ చేయించ టానికి అనుమతించండి సీతమ్మగారూ! మీ కొడు కులూ, కోడళ్లూ, మనమలూ, ముది మనమలకు తీర్థ ప్రసాదాలిచ్చి, మంత్రోపదేశాలు చేసి, చక్రాంకితాలు వేసి మీ వంశపరంపరకు ఆ శ్రీరామానుజులవారి కృపకలుగజేసి తరింప జేస్తాం!'' అంది లౌక్యంగా.

** ** **

సీతమ్మగారి డాబా యింట్లోని వెనకగదిలో వేంచేసి యున్న శ్రీ పెరుమాళ్లు ముందు నూనెదీపం నిశ్చ లంగా వెలుగుతూంది.

ఏకదీక్షగా వెలుగుతున్న ఆ దీపకాంతిలో పెరు మాళ్లు వారు నిర్వికల్పసమాధి స్థితిలో వున్నారా అన్నట్లు చిద్విలాస మూర్తులై వున్నారు. వర్ధనమ్మగారు అర్ధనిమీలిత నేత్రాలతో స్వామివారిలోని పరంజ్యోతిని చూస్తానికి ప్రయత్నిస్తోన్నారు.

ఆమె పెరుమాళ్లకు తిరు ఆరాధన చేసి నైవేద్యంగా సమర్పించటానికి సొతాలించిన శనగలూ, ధూపం వేయ టానికి సాంబ్రాణీ, తీర్థం కోసం నీళ్ల పట్టి వుంచిన రాగి తీర్థం చెంబూ తులసీ దళాలూ, మంగళహారతి యివ్వటానికి కర్పూరం మొదలైన పూజాసామాగ్రి యావత్తు సిద్ధం చేసుకొని కూర్చుంది. అన్నీ వున్నాయి గాని అసలు పూజా కార్యక్రమం నెరవేర్చవలసిన మన మడు శ్రీ రంగశాయి మాత్రం అంతులేదు. వూరు చూచి వస్తానని చెప్పి మధ్యాహ్నం భోజనాల తర్వాత యింటి వారి అబ్బాయిల్తో కలిసి బయటికెక్కడికో వెళ్ళాడు.

అక్కడికి వెళ్లే ముందు, ''త్వరగా రారా నాయనా!

పెరుమాళ్లకు తిరు ఆరాధన చేయాలి! ఆడముండను, నేను ప్రక్కన వుండి ఇవీ అవీ అందించేదాన్నే గాని అసలు పూజతంతు జరిపించవల్సిన వాడివి నీవ్వే! నీకు మంత్రాలు రాకపోతే ప్రక్కన వుండి నీకు అందిస్తాను. అంతవరకే! పూజ మాత్రం నీ చేతుల మీదగా జరగాల్సిందే!'' అని మరీ మరీ చెప్పింది.

“ఇదిగో వస్తాను!'' అని చెప్పి వెళ్లినవాడు రాత్రి ఎనిమిది గంటలు దాటుతున్నా అజాపజా లేదు. అసలికే అర్భకుడు. ఈ వూరుగాని వూళ్లో పిల్లవాడు ఏమయి పోయాడోనని ఆమె వూరికే కంగారు పడి పోతూంది.

'ప్రొద్దుటెప్పుడో చేసిన అలంకారాల్తో స్వామి వెలా తెలా పోతున్నారు. తిరునామాలు చెమ్మదరిగి వున్నాయి. పూలు వాడి వున్నాయి. పోనీ యింటివారి పిల్లలతో నయినా పూలమాల అలంకరింపచేద్దామంటే యింట్లోని ఆడవాళ్లూ, పిల్లలూ అంతా కట్టకట్టుక్కొని టీవిలో ఏదో మంచి సినేమా వుందని ప్రక్కింటి చౌదరిగారింటి కెళ్ళారు. అక్కడికీ వాళ్ల వెళ్లే ముందు తాను సీతమ్మగారి కోడళ్లతో అంది కూడా- స్వామి వారి కీర్తనలూ, భజనలూ నేర్పిస్తాను కూర్చోండమ్మా అని. వాళ్లు వింటేనా? టీవిలో సినేమా చూడాలని వెళ్లి పోయారు.

'ఇహ మిగిలింది బిక్కు బిక్కుమంటూ తానూ, గడపకానుకొని కునికి పాట్లుపడుతున్న ఆ సీతమ్మగారూ- ఈ ముసలి ముండలను చూస్తూ చిద్విలాసంగా చిర్న గవులు వెదజల్లే పెరుమాళ్లున్నూ!'

'వర్ధనమ్మగారు దీర్ఘంగా నిట్టూర్చింది.

'ఇంటి దగ్గర్నుంచి బయలుదేరుతున్నప్పుడు పక్ష వాతంతో మంచానపడి తీసుకుంటున్న తన కొడుకు కృష్ణమాచార్యులు, 'అమ్మా! నీ ప్రయాసేగానీ నీవు వెళ్ళి ఏమీ లాభం లేదమ్మా! కాలం మారిపోయింది- ఆ పాత కాలం కాదు; ఆపాత మనుషులూకారు. గురువుల్ని ఆదరించి, గౌరవించే ఆ వైదిక కాలం ఎప్పుడో పోయింది!' అని అననే అన్నాడు.

'అయినా ఆశ చావక, చితికిపోయిన కొడుకు సంసారం అనుభవిస్తోన్న ఆ కటిక దారిద్ర్యాన్ని చూళ్లేక, మనుషులు మరీ అంతగా మారిపోయారంటే నమ్మలేక, పాత కావిడిపెట్టె అడుగున పడి వున్న తాళపత్ర గ్రంథాన్ని బయటికి తీసి దుమ్ము దులిపి, తరతరాలుగా తమకు సంక్రమిస్తోన్న శ్రీ పెరుమాళ్లవారి విగ్రహాలను చంకన పెట్టుక్కొని, మనమడ్ని వెంట పెట్టుక్కొని బయలుదేరింది.

' ఏదో-మహాతల్లి ఈ సీతమ్మగారు ఇంకా బ్రతికి వుండబట్టే ధర్మాత్ముర్మరాలు తమను ఆదరించి. ఈ వెనగ్గదిలో ఇంత బస చేసుకోటానికి ఏర్పాటు చేయించింది. ఈ రెండు రోజులుగా రెండు పూటలా వంట చేసుకోవటానికి నెయ్యీ పెరుగు, వుప్పు, పప్పు, సన్నబియ్యం, కాయగూరలూ అన్నీ పెట్టించి ఎలాంటి లోటూ లేకుండా స్వయం పాకం యిప్పిస్తూనే వుంది పుణ్యాత్మురాలు!

'అవును, ఈ కుర్ర నాగన్న ఎక్కడికి జేరినట్లు? వీడు వుంటె తిరు ఆరాధన చేయించి, తీర్థ ప్రసాదాలిప్పిద్దాం అనుకుంది. ఫలానా వారింట్లో వైష్ణవ గురువులు వేంచేసి పూజలూ పునస్కారాలూ చేయిస్తోన్నారని కాస్త పేరు బడితే గ్రామంలో వున్న శిష్యపరంపరలూ, తదితర పెద్దలూ వచ్చి భిక్షకు రమ్మని ఆహ్వానిస్తారు. సకల మర్యాదలూ చేస్తారు. ఘనంగా కానుకలు సమర్పించు కుంటారు. పోయినసారి తాము ఈ గ్రామానికి వచ్చి నప్పుడు ఈ గ్రామస్థులు తమని నెత్తి మీద పెట్టు కున్నారు. గురుభిక్షలూ, పాదపూజలూ పోటీలుపడి మరీ చేశారు. ఈ గ్రామంలో దొరికిన కానుకలూ, సంభారాలతో అప్పుడు అర్నెల్లపాటు తమ సంసారానికి నిశ్చింతగా గడిచిపోయింది.....'

వర్ధనమ్మగారు ఆలోచనలు ఆపి లేచి, దీపం ప్రమ్మలో మరి కాస్త నూనె పోసి, దీపం వత్తిని కదిలించింది.

సీతమ్మగారు, “పొదు నడుంనెప్పి సాయంతరం మంచి మరీ ఎక్కువగా వుంది! వెళ్ళి పడుకుంటా నమ్మా!'' అంటూ లేవలేక లేచి, నడవలేక నడుస్తూ సావిట్లో కెళ్ళిపోయింది.

తను కూడా కరెంటు దీపం ఆరిపేసి పమిట చెంగు నేల మీద పరచుకొని మెల్లగా క్రింద వడ్డిగిలింది. మెల్లగా నిద్రపట్టింది...

-గదిలో అలికిడికి ఆమెకు గబుక్కున మెలకువ వచ్చింది.

కళ్ళు తెరచి చూచింది.

గదిలో పెరుమాళ్లు ముందు ఎవరో ఏదో సవరిస్తో న్నారు.

కళ్లు బాగా చికిలించి చూచింది.

తన మనమడు శ్రీ రంగశాయి.

పెరుమాళ్ల తీర్థం కోసం నీళ్లు ఎత్తిపెట్టి వుంచిన రాగిచెంబూ, రెండు ఖాళీ గ్లాసులూ తీసికొని బయటి కెళ్లుతున్నాడు.

బయట ఎవరికైనా మంచితీర్థం యివ్వటానికి వెళ్ళ తున్నాడేమోలే అని మగతగా మరి కాసేపు అలాగే పడుకుంది.

బయటకెళ్లినవాడు ఎంతసేపటికీ లోపలికి రాకపోయే సరికి ఆమె మెల్లగా లేచి బయటకి వచ్చింది.

బయట పిండి ఆరబోసినట్లుగా, పెరుమాళ్లవారి నవ్వులాగా వెన్నెల తెల్లగా, చల్లగా వుంది. ఈ వెన్నెల




## బాలయోధుడు వసంత్

ట్రాంలైన్ పట్టాలపై అడ్డంగా ఓ బాలుడు పడుకుని-

“ట్రాములు మా పట్టణంలోకి రావడానికి వీలులేదు. విదేశీ వస్త్రాల బేళ్లను మోసుకువస్తూన్న ఈ ట్రాములను రానివ్వం. మీరు మా మాటలు వినకుండా దౌర్జన్యంగా రావాలనుకుంటున్నారా... అయితే ట్రాములను నా మీదుగా పోనివ్వండి'' అంటూ బిగ్గరగా హెచ్చరించాడు.

ఒక బ్రిటిష్ పోలీస్ ఆఫీసరు అటువేపు వచ్చి ఈలవేస్తూ-

“ఏమైనా సరే! ట్రాములు నడవాల్సిందే. ఎవరు వచ్చినా భయం లేదు. ఊ... పోనియ్యండి'' అని ఆజ్ఞాపించాడు.

క్షణంలో అంతా ఆక్రందనలు అలముకున్నాయి. బ్రిటిష్‌వారి అహంకారాన్ని, ఆక్రమాన్ని మట్టుపెట్టడానికి ఆ బాలుడు తన రక్తతర్పణంచేశాడు-

“వసంత్! బాబూ!...'' అంటూ విలపిస్తూ వచ్చిన ఆ బాలుని తల్లి ఆ దృశ్యాన్ని చూసి కర్రలా నిలబడిపోయింది. ఆమె కళ్లల్లో నీళ్ళు ధారగా కారిపోతున్నాయి-

“మంచి పనిచేశావు నాయనా! నీవు మనదేశం కీర్తి నిలబెట్టావు. నాకు యింకా ఎందరు కొడుకులున్నా నీలాగే దేశం కోసం బలియిచ్చేదానిని'' అంటూ చితికి, రక్తం మడుగులో వున్న తన కొడుకు మీద వాలిపోయింది.

ప్రజలు గగ్గోలు పెట్టారు. పోలీసులు మాత్రం పాషాణాల్లా నిలబడిపోయారు.

దేశం కోసం తన ప్రాణాలనే బలియిచ్చిన ఆ చిన్నారి దేశభక్తుని శవంపై పూలవాన కురిసింది.

ఈ సంఘటన-స్వాతంత్రోద్యమ కాలంలో విదేశీ వస్త్ర బహిష్కరణోద్యమం దేశమంతటా ముమ్మరంగా జరుగుతున్న కాలం నాటిది. బొంబాయి నగరంలో జరిగిన సంఘటన ఇది.

అప్పుడే గాంధీజీ- “విదేశ వస్తువులను బహిష్కరించండి. ఇంగ్లండు నుంచి మనదేశానికి వస్తున్న వస్త్రాలను కొనకండి'' అంటూ ఉద్బోధించాడు.

—ఎ. పండరినాథ్

చెట్టుకు పూసిన పూలా అన్నట్లు నక్షత్రాల గుత్తులు.

డాబా మీద నుంచి మెల్లగా మాటలు వినిపిస్తోన్నాయి.

మెల్లగా మెట్లెక్కింది.

ఇంటి వాళ్ళబ్బాయిలూ, రంగశాయీ పైన కూర్చొని కబుర్లాడుకుంటున్నారు.

"ఏం కాదు త్రాగవయ్యా బాబు! ముందు అలాగే కాస్త చేదుగా, మంటగా వుంటుంది. గొంతు లోపలికి దిగేక నిన్ను గంతులేపిస్తుంది!"

ఇంటివారబ్బాయితో తన మనమడు రంగశాయి అంటున్నాడు.

"ఏమో బాబు! మాకింతవరకు అలవాటు లేదు. ఇప్పుడు నీవే త్రాగిస్తోన్నావు!" ఆ అబ్బాయి బావ అంటున్నాడు.

రంగశాయి నవ్వుతూ, "ఎప్పుడూ త్రాగంది త్రాగితే, ఎప్పుడు చెయ్యంది చేస్తేనే జీవితంలో మజా వాయువా!" అంటూ మజోపదేశం చేస్తోన్నాడు.

"ఓ రంగశాయి గురువుగారూ! మధ్యాహ్నం మాకు పేకాట నేర్పించావు. ఇప్పుడు ఇలా త్రాగిస్తోన్నావు. ఇంకా మాకు ఏవేవి నేర్పిస్తావో కదా!"

"జీవితంలో నీవు ఇంకా నేర్చుకోవల్సినవి, అనుభవించవల్సినవి చాలా వున్నాయి శిష్యా! అప్పుడే అయిపోయిందా?"

-శిష్యపరంపరలకు బ్రహ్మోపదేశాలు చేసిన ఆ మహానుభావుడు శ్రీమాన్ తిరువేంగళాచార్యులుగారి మనమడు చేస్తోన్న వుపదేశమిది!


ప్రేక్షాదార్కా

'చవటాయ్' కార్టూన్ శీర్షిక

వచ్చేవారం నుంచి వారం! వారం!


-శ్రీమాన్ తిరువేంగళాచార్యుల వారు తమ శిష్యులకు శ్రీ పెరుమాళ్లవారి పాదోదకం తీర్థంగా యిస్తే, ఆయన మనమడు-ఈ దౌర్భాగ్యుడు ఈ 'తీర్థం' యిస్తోన్నాడు!

-తరతరాలుగా వస్తోన్న శ్రీ పెరుమాళ్లవారి తీర్థం చెంబు ఈ రోజుకు ఇలా వుపయోగపడుతూంది!

-శ్రీమాన్ తిరువేంగళాచార్యుల వారు ఆనాడు తమ శిష్యులకు వేదాంతాల రహస్యాలు బోధిస్తే, వీడు ఈనాడు ఇలాటి భ్రష్ట నీతులు బోధిస్తోన్నాడు!

"ఒరే భ్రష్టుడా! మా వనుకూరి వారి వంశాన చెడబుట్టావు కదరా దౌర్భాగ్యుడా!..." వర్ధనమ్మగారు పట్టరాని కోపంతో వూగిపోతున్నారు.

"అరేయ్ వెధవా, రంగశాయీ!" ఆమె ఆవేశంగా గట్టిగా కేకపెట్టింది.

ఆ ముగ్గురూ వులిక్కిపడి వెనక్కి తిరిగి చూశారు.

మెట్ల మీద ఆమె అపరకాళికలాగా, చండప్రచండ ఛండికలాగా నిలబడి వుంది.

** ** ** ** **

ఊరి చివర చెరువు. చెరువు గట్టు మీద పెద్దరావి చెట్టు. రావి చెట్టు తిన్నె మీద వర్ధనమ్మగారు కూర్చొని వున్నారు.

పెరుమాళ్ల విగ్రహాలూ, పూజాసామాగ్రీ వున్న కాషాయ రంగు సంచి వళ్లో పెట్టుకొని వున్నారు. రంగశాయి చేతిలో ట్రంకు పెట్టె పట్టుకొని వున్నాడు.

బస్సు కోసం ఎదురు చూస్తోన్నారు.

సీతమ్మగారు, "ఇంత అర్ధంతరంగా వెళ్ళిపోతున్నారేంటీ? ఇంకా రెండు రోజులు వుండండీ!" అని అంటున్నా వినకుండా, "వద్దులే తల్లీ!" అని తెల్లారేసరికి వూరికి తిరుగు ప్రయాణం కట్టింది.

'బస్సు ఇంకా వచ్చి చావలేదు.' వర్ధనమ్మగారు విసుగ్గా లేచి నిలబడింది.

అప్పుడామె దృష్టి పెద్ద వేప చెట్టు క్రింద వున్న ఆ గ్రామ దేవత పోలేరమ్మగుడి మీద పడింది.

'తన భర్త శ్రీమాన్ తిరువేంగళాచార్యులుగారు ఈ గ్రామంలో అడుగు పెట్టే ముందు ముందస్తుగా ఈ గ్రామ దేవత ఈ పోలేరమ్మ అమ్మవార్ని దర్శించి, ఈమె అనుమతి తీసుకొని గ్రామ ప్రవేశం చేసేవారు.




గ్రామం వదిలి వెళ్లబోయే ముందు మళ్లీ ఈమె శలవు తీసుకునేవారు.

ఈ సంగతి ఈగుడి చూశాక తనకిప్పుడే గుర్తుకు వచ్చింది.'

ఆమె మెల్లగా లేచి గుడి లోపలికి వెళ్లింది.

'అదే పోలేరమ్మ! చక్కటి కళ్లూ, చల్లని చూపులూ అవే!' ఆమెకు దుఃఖం ముంచుకొచ్చింది.

'నీ అనుమతి లేకుండా నీ గ్రామంలోకి అడుగు బెట్టినందుకే గాబోలు, శిష్యపరంపరలను ధర్మ మార్గాన బెట్టి తరింపజేయాల్సిన యింట మెట్టిన నేను, ఈ దౌర్భాగ్యుడు చేసిన ఈ అనాచార కార్యానికి కారకు రాలినయ్యానమ్మా! కన్నకొడుకు సంసారం కటిక పస్తులతో కటిక దరిద్రం అనుభవిస్తోంటే చూడలేక, వాళ్ళు కానుకలు దొరుకుతాయేమోనని వచ్చేను గాని ఈ భ్రష్టుడిలా చేస్తాడనుకోలేదు తల్లీ! దేశం పాడైపోయిందంటె ఏమో అనుకున్నానుగానీ, ఈ ధర్మ సంకరం, ఈ అనాచారమూ మా గురువులింటే పుట్టిందని తెలుసుకోలేక పోయానమ్మా! ఇంట్లో ఓ మూలబడి వుండే ముసలిముండను, మా యింటబుట్టిన బిడ్డే ఇలాటి అనాచారపు గడ్డయ్యాడని కానుకోలేకపోయానమ్మా జగన్మాతా!...' ఇలా తనలో తాను కుమిలి పోయింది.

కళ్లు తుడుచుకుంటూ బయటికి వచ్చింది.

రంగశాయి క్రితం రోజు పేకాటలో గెల్చుకున్న డబ్బు బయటికి తీసి తృప్తిగా లెక్క పెట్టుకుంటున్నాడు.

"ఇంకా రెండు రోజులుందామంటె వినకుండా బయలుదేరదీశావు! ఇంకా చాల డబ్బులు వచ్చేవి!" మెల్లగా గుణిసాడు.

"నోరు ముయ్యరా దౌర్భగ్యుడా! శిష్యులకు ఇంత తీర్థ విచ్చి, వాళ్లు మంచి మాటలు చెప్పి వాళ్ల భక్తితో యిచ్చే కానుకలు తీసుకోవాలా మనం! అంతేగాని వాళ్లతో జూదమాడించి, వ్యసనాలు నేర్పించి డబ్బులు సంపాదించకూడదురా! ఇలాటి పాపిష్టి డబ్బుతో తినే కూడు కూడా విషపు కూడే అవుతుంది! ముందాడబ్బు ఆ బిచ్చగానికి పడేయ్!" అంది కోపంగా.

ముసలాబిడ మాటలు పట్టించుకోకుండా ఆ డబ్బును జాగర్తగా జేబులో పెట్టుకున్నాడు. ట్రంకు పెట్టెలోంచి తాళపత్ర గ్రంథాన్ని బయటకి తీసి, కమ్మల్ని అటూ ఇటు త్రిప్పి చూశాడు.

"ఈ చుట్టు ప్రక్క గ్రామాలలో మన శిష్య పరంపరలు ఇంకా చాల మంది వున్నారు. వాళ్లను కూడా పరామర్శించి తరింపజేద్దామే నాయనమ్మా!" అన్నాడు.

"బోలెడు డబ్బులు వస్తాయి. మన దరిద్రం తీరి పోతుంది!"

"నీ తరింపజేయటం తగలడ్డట్టే వుంది! ఇలాటి అపచారపు పన్లు చేసి డబ్బు సంపాదించేకంటే ఆకలితో, పస్తులతో చచ్చినా మాబాగు! నీవు చేసిన ఈ అపచారానికి పెరుమాళ్లు మనల్ని కట్టికుడుపుతాడు" అంటూ మనమడి చేతిలోని తాళపత్ర గ్రంథాన్ని లాక్కుంది. ఆమె మనస్సు ఆవేదనా భరితమైపోయింది.

"మన తరతరాల్నుంచీ వస్తోన్న ఈ గ్రంథం జనాన్ని బాగు చెయ్యటానికే గాని భ్రష్టుల్ని చెయ్యటానికి కాదు. ఇది నీలాటి వాడి దగ్గర వుంటే ప్రమాదం! దీన్ని అడ్డుగా పెట్టుకొని వెర్రి మెర్రి వేషాలేసి జనాల్ని మోసం చేసి భ్రష్టుల్ని చేస్తావు. ఇది నీ చేతిలో వుండకూడదు!" అంటూ వర్ధనమ్మగారు ఆ తాళపత్ర గ్రంథాన్ని ప్రక్కనున్న చెరువులోకి గిరవాటేసింది.

ఈ హఠాత్పరిణామానికి రంగశాయి బిత్తరపోయి చూస్తుండిపోయాడు.

## ఫోటో వ్యాఖ్య పోటీ



ఫోటో: కేతా నాగేశ్వరరావు, సిద్ధాంతం

ఈ ఫోటోకు సముచితమైన వ్యాఖ్యను 10-5-86 లోగా వ్రాసి పంపి రు. 15 బహుమతి గెలుచుకోండి! పోస్ట్‌కార్డ్ మాత్రమే ఉపయోగించాలి. చిరునామా : ఫోటో వ్యాఖ్య పోటీ, ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, పో.బా. నెం. 712, లబ్బీపేట, విజయవాడ -10

—ఎడిటర్